
# పెళ్ళికొడుకు కనుమ

కన్నడమూలం: శ్రీమాస్తి వెంకటేశ అయ్యంగార్

అనుసరణ: జనుమద్ది హనుమచ్ఛాస్త్రి



[ శ్రీమాన్ మాస్తి వెంకటేశ అయ్యంగార్ ఆధునిక కన్నడ కథా పితామహుడు. నవల, నాటక, విమర్శ, జీవనచరిత్ర, అనువాదం, కథాకావ్య కర్తృత్వం, సంపాదకత్వం మున్నగు విభిన్న పీఠప్రశస్తి నందుకొన్న సాహితీమూర్తి. వారి కథాకావ్య సంపుటం 'అరుణలో'లో 'మదలింగనకణివె' (పెళ్లికొడుకు కనుమ) అతి విశిష్టమైనది. గ్రామనామ చరిత్ర ఆధారంగా రచింపబడింది. ]

మైసూరు ప్రాంతంలోని చిక్కనాయకనహళ్ళి తాలూకా కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోవున్న చిన్న పల్లెటూరు. "మదలింగనకణివె" (పెళ్ళికొడుకు కనుమ) ఈ గ్రామాన్ని "చుట్టు పల్లె" అనికూడా పిలుస్తారు. ఈ కనుమ చరిత్రలో దాగిన కథ రాతిగుండెలను సైతం కరగిస్తుంది. సరళమైన "రగడ"లో సాగిన యీ కథ గద్యశైలికి సన్నిహితంగావుంటుంది.

కొన్నేళ్ళక్రితం సంఘటన : కనుమ ప్రక్కన ఒక పల్లె: ఆ పల్లెటూళ్ళో అందంగావుండే అక్కచెల్లెళ్ళిద్దరు వుండేవారంటూ కవి కథను ప్రారంభిస్తాడు. అందగత్తెలు అన్న ఒక పదంతోనే వారిని చిత్రించాడు కవి.

పెళ్ళికొడుకు యువకుడు. సాహసప్రవృత్తి, స్వాభిమానం కలవాడు. చూపరులను అట్టే ఆకర్షించే విగ్రహం. పెద్దమ్మాయితో అతని పెళ్లి జరిగి మూడురోజులైంది. మంచి ముహూర్తం చూచుకొ ఇల్లాలితోపాటు స్వగ్రామం బయలుదేరాడు పెళ్ళికొడుకు.

మొట్టమొదటిసారి అత్తగారింటి కెళ్ళే కూతురును ఒంటరి పంపటం సంప్రదాయం కాదు. పెళ్ళికూతురుతో పాటు ఆమె త జాణ అన్న చెల్లెలు కూడా ప్రయాణం సాగించారు. సరసోక్తు సల్లాపాల మధ్య ప్రయాణం సాగింది.

అక్క అత్తగారింటికి వెళ్ళిన తర్వాత తాను ఒంటరి వుండాల్సి వస్తుందన్న బెంగ చెల్లి జాణమ్మకు.

బరువైన గొంతుతో 'అక్కయ్యా, మమ్మలను వదలి వె టానికి మనసొచ్చిందా?' అని ప్రశ్నించింది చెల్లి.

చెల్లిని వదలి పోవటం ఆమెకెంతో బాధగా వుంది. ఆకు ఆకుగా అన్యోన్యంగా పెరిగారిద్దరు. చెల్లి మాటలు విన్న అక్క కన్నీరు కట్టలు తెంచుకుంది. మౌనం ఆవహించింది.

తల్లి, 'రేపు నీవు మాత్రం భర్తతో పాటు వెళ్ళకుండా వుంటావామ్మా? కొత్త అనుబంధాలతో మనసు మార్చుకోక తప్పదు' అన్నది.

జాణమ్మ ముసిముసిగా నవ్వుతూ, 'నాకు పెళ్ళే వద్దు' అన్నది.

అంతలో పెళ్ళికొడుకు, 'పెళ్ళికి ముందు అందరూ అలాగే అంటారు. వద్దు వద్దు అంటూ, ఎవడో ఒకడు వచ్చి చేపడితే అతని వెంట పరుగు తీస్తారు' అంటూ పరిహసించాడు.

జాణ, అసలు ఆ అమ్మాయి పేరే జాణమ్మ "ఇంకా పెళ్ళయి మూడు రోజులు కాలేదు. బావగారు అన్నీ తెలిసిన వాడిలా మాట్లాడటమే? అన్నది.

పెళ్ళికొడుక్కు మరదలితో సరసాలాడటం యిష్టం.

వయసు, అందం, చిలిపితనం పొంగే పిల్ల సరసోక్తులకు మారు పల్కని యువకుడుంటాడా?

"నాకు అన్నీ తెలుసో, లేదో నీకెలా తెలిపేది? అక్కను వదలి వుండటానికి ఇష్టం లేకుంటే మాతోనే వుండు. అప్పుడు నీకే తెలుస్తుంది' అన్నాడు కొంటె బావ.

మరదలు పిల్ల నవ్వింది.

ప్రయాణం సాగుతూ వుంది.

అక్క కూడా చెల్లెమ్మను తనతోపాటు వుంచు కోవాలనుకుంది.

'జాణను మాతో వుండనీయమ్మా' అని తల్లిని అడిగింది.

మరదలిపై మోజుపడిన పెళ్ళికొడుకు పెళ్ళాం కోరికకు ఒత్తాసు పలికాడు.

అక్కచెల్లెళ్ళ అనుబంధం అలాంటిది.

పెద్దికూతురి మాటలు తల్లికి అంతగా రుచించలేదు. కట్టుకొన్న ఒక పెళ్ళాంతోనే ఏగలేని వారెందరినో ఆమె చూచింది.

'మీలాంటివారు నిండు యవ్వనంలోని ఇద్దరు పెళ్ళాలను ఎలా ఏలుకుంటారు?

అ మాటలు పెళ్ళికొడుకు స్వాభిమానానికి ఈటెల్లా గుచ్చుకున్నాయి.

'అత్తమ్మా, నేనేం మగాణ్ణి కానా? మీ పెద్ద కూతురుతో పాటు, మరదల్ని ఏలుకోలేననుకున్నారా? ఇద్దరు పెళ్ళాలతో కాపురం చేసే వారెందరు లేరు?' అని సమాధాన మిచ్చాడు.

మాటల్లోనే వారు చుట్టుకనుమ దగ్గరికొచ్చారు.

కనుమ దాటితే పెళ్ళికొడుకు వూరు. కనుమగుండా వెడితే మూడు మైళ్ళు. ప్రక్కనే వున్న కొండ ఎక్కి దిగితే ముప్పాతిక మైలు మాత్రమే.

కొండ నిటారుగా వుంది. దాన్ని ఎక్కి దిగటం కష్టమే.

అత్తమ్మ ఏమనుకుందో.

'అంత ఇష్టంగా వుంటే ఈ కొండను పీపు చేసుకొని ఎక్కాలి. అలాగే అవతలి వైపు దిగాలి. మా జాణమ్మను పెళ్ళాడ్డానికి నాకే అభ్యంతరం వుండదు', అంది యథాలాపంగా.

అత్తమ్మ మాటలు అల్లుని పౌరుషాన్ని రెచ్చగొట్టాయి. అదొక సవాల్‌గా తీసుకున్నాడు. జాణపై అతనికున్న ప్రేమ అతన్ని మరింతగా ప్రేరేపించింది.

నేను మీరన్నట్టే కొండెక్కి అటువైపు దిగుతా. వెంటనే జాణ చేత్తో చెంబు నిండా నీళ్ళు యిప్పించండి.' అన్నాడు.

మరదలివైపు చూచాడా బావ. మరింత వుత్సాహం తెచ్చుకున్నాడు.

కొండ నిటారుగా వుంది. ఎండ మండుతూ వుంది. అయినా కొండ ఎక్కనారంభించాడు.

అత్తమ్మ కేదో భయం.

'ఈ ఎండలో కొండెక్కి బ్రతికి బయట పడగలడా? అని ఆమె గుండె కొట్టుకోసాగింది.

'వద్దు నాయనా, ఏదో మాటవరస కన్నాను. అంతే. దయచేసి తిరిగి రా, నాయనా' అని బతిమాలుతూ కేక వేసింది.

పెళ్ళికొడుకు పంతం మానలేదు. కొండ పైకి పాకుతూ పోతున్నాడు.

సరసాని కన్న మాటలు యీ రీతిగా పరిణమించినందుకు మూడు హృదయాల్లో మూగవేదన ప్రారంభమయింది.

పెళ్ళికొడుకు కొండశిఖరంచేరి కాసేపు విశ్రమించి చేతనున్న నిమ్మకాయను పీల్చి విత్తులను వుమ్మేశాడు.

ముగ్గురు ఆడవాళ్లు గబగబా కొండ అవలవైపు చేరారు.

వయసు మళ్ళిన తల్లికి దాహం వేసింది. పెద్దకూతురు 'అమ్మా నీవు కాస్తా దాహం పుచ్చుకో' అంటూ చేతనున్న నీటి చెంబును యివ్వబోయింది.

ఆ మాటలు జాణకెందుకో సహించలేదు.

ఎండలో నడచి వచ్చిన తమకే అంత దాహంగావుంటే కొండెక్కి దిగి వస్తున్న బావ ఎంత దప్పికతో వుంటాడో ? అనుకుంది జాణమ్మ.

'ముందు బావను తాగనివ్వమ్మా' అన్నది. పందెం గెల్చి జాణను తన దానిగ చేసుకుంటానని వువ్విళ్లూరుతున్నాడు పెళ్ళికొడుకు.

'నా బావ పందెం గెల్చారు. అతనితో సుఖంగా కాపురం చేస్తానని' మరదలు గంపెడాశతో వుంది.

తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తుంది. పెళ్ళికొడుకు బాగా అలసిపోయాడు. ఊపిరి పీల్చటానికి కూడా కష్టమైంది. నోట మాట రావటంలేదు. సైగలు చేస్తూ జాణవైపు చూశాడు. జాణమ్మ చెంబుతో నీళ్లు అందివ్వాలని ముందుకెళ్లింది. చేతులు తడబడుతున్నాయి. బావ పరిస్థితి చూచి కాళ్లు వణికాయి. ఈ స్థితిలో చేతిలోని చెంబు జారి నీళ్ళన్నీ నేలపాలయ్యాయి.

పెళ్ళికొడుకు జాణవైపు చూస్తూ అలాగే కుప్పకూలిపోయాడు.

జాణమ్మ కళ్ళకు బైర్లు కమ్మాయి.

'అయ్యో - బావ' అంటూ పడిపోయింది.

అత్తమ్మ 'అయ్యో, అయ్యో' అంటూ చీర చెంగుతో అల్లునికి గాలి వీస్తున్నది.

పెద్దకూతురు రోదిస్తూ. 'నా భర్తను చంపేశావు' అంటూ తల్లికి శాపనార్థాలు పెట్టసాగింది.

'నాసుఖాన్ని చూడలేక నీటిని నేలపాలు చేసి, నా కాపురం కూల్చావుకదే' అంటూ చెల్లిని చీదరించుకుంది.

జాణకు మాట పెగల్లేదు. ఖాళీచెంబుతో పక్క పల్లెవైపు పరుగుతీసింది. నీటితో తిరిగి వచ్చింది. అంతలోనే బావ కాలం చెల్లింది. మరదలు వచ్చేంతలోనే బావ శవమయ్యాడు.

పెరిగే పైరు ఛాదపదంలోనే అగ్గిపాలైంది అంటూ మాస్తిగారు కథను ముగించారు.

. . . .

పెళ్ళికొడుకు చచ్చి ఆ కనుమకు తన పేరు యిచ్చివెళ్ళాడు.

అనాడి దయనీయ స్థితిని చూచిన రాళ్లు నేటికీ రోదిస్తున్నాయి అంటాడు కవి.

దప్పికతో అలమటించి అసువులు బాసిన అల్లుని ప్రేతాత్మ నేటికీ ఆ కొండచుట్టూ తిరుగుతూ వుందని ఆ ప్రాంత ప్రజల విశ్వాసం.

అత్తమ్మ, పెళ్ళికూతురు, మరదలు ఏమయ్యారో చెప్పలేదు కవి.


# ఆంధ్ర సచిత్ర వారపత్రిక

(స్థాపితం : 1908)

గాంధీనగరం : : విజయవాడ – 3

ఇంట్లో అందరికీ ఆనందాన్ని ఇచ్చే శీర్షికలు! కథలు!! వ్యాసాలు!!!

* సాహిత్య విలువలున్న సీరియల్ కథలు
* వైవిధ్యం వున్న కథానికలు
* అన్ని తరాలవారినీ అలరించే "ప్రశ్నావళి" "ధర్మపథం" న్యూఢిల్లీ లేఖ

ఇంకా ఎన్నో ఆకర్షణలతో ఏ వారాని కా వారమే కొత్తదనాన్ని పుణికి పుచ్చుకుని మీకు అందుతుంది.

విడి ప్రతి వెల రు. **2-00**

సంవత్సరచందా (పోస్టుద్వారా) రు. **111-80**పై.

ఆరు మాసాలకు (పోస్టుద్వారా) రు.**55-90**పై.

మీ స్థానిక ఏజెంటుద్వారా తెప్పించుకుంటే ప్రతివారం తెల్లారేసరికల్లా మీముందు వుంటుంది.

రచనలు పంపే చిరునామా :

సంపాదకుడు, ఆంధ్రసచిత్రవారపత్రిక,
గాంధీనగరం, విజయవాడ-520 003

ఇతర వివరాలకు :

బిజినెస్ మేనేజర్, ఆంధ్రపత్రిక,
గాంధీనగరం, విజయవాడ-520 003